సాక్షి
కామారెడ్డి
ఆదివారం । 1 । సెప్టెంబర్ । 2024



రైతుల అభ్యున్నతి కోసమే..

రైతుల అభ్యున్నతి కోసమే తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పనిచేస్తోందని ఆ సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి పేర్కొన్నారు.

- 8లో ▸



ఉల్లంఘిస్తే కేసులు..

ఆర్‌ఎంపీలు, పీఎంపీలు నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు నమోదు చేస్తామని అధికారులు హెచ్చరించారు.

- 8లో ▸

గరిష్టం/కనిష్టం
32.9/22.2

వాతావరణం

ఉదయం చల్లని గాలులు వీస్తాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. జిల్లావ్యాప్తంగా ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ఎల్లారెడ్డిలో బీఆర్‌ఎస్‌కు షాక్

- కాంగ్రెస్‌లో చేరిన ఐదుగురు కౌన్సిలర్లు



ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి బల్దియాలో బీఆర్‌ఎస్ పార్టీకి బిగ్‌షాక్ తగిలింది. పార్టీకి చెందిన ఐదుగురు కౌన్సిలర్లు శనివారం ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు సమక్షంలో కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో కౌన్సిలర్లు శ్రీకాంత్,భూదేవి,నీలకంఠం, శ్రీనివాస్, బాలమణి ఉన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కౌన్సిలర్ మహేశ్వరి, పార్టీ మండల అధ్యక్షుడు సాయిబాబా, నాయకులు వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, నునుగొండ శ్రీనివాస్, విద్యాసాగర్, గోపి, తిరుపతి, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో 30, 30 ఏ పోలీస్ యాక్టు అమలు

కామారెడ్డి క్రైం: జిల్లా వ్యాప్తంగా ఈనెల 7 వ తేదీ వరకు 30, 30 ఏ పోలీస్ యాక్టు అమలులో ఉంటాయని ఎస్పీ సింధు శర్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోలీసుల అనుమతి లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు, ఎలాంటి ఆందోళన కార్యక్రమాలు చేపట్టరాదని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

దీపాదాస్ మున్షీని కలిసిన పోచారం



బాన్సువాడ : వ్యవసాయ శాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి శనివారం హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీని కలిశారు. త్వరలో తాను వ్యవసాయ శాఖ సలహాదారుగా బాధ్యతలు స్వీకరించనున్నానని, ఆ కార్యక్రమానికి రావాలని కోరారు. ఆయన వెంట డీసీసీబీ మాజీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి, నాయకులు గాలీరెడ్డి రాజీవ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

'పకడ్బందీగా ఓటరు జాబితా తయారు చేయాలి'



దోమకొండ : గ్రామ పంచాయతీల ఓటరు లిస్టను పంచాయతీ కార్యదర్శులు, బీఎల్‌వోలు పకడ్బందీగా తయారు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శనివారం దోమకొండలో ఓటరు జాబితా తయారు ప్రక్రియను ఆయన పరిశీలించారు. మండలానికి చెందిన అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఓటరు జాబితాలో ఎలాంటి పొరపాట్లు లేకుండా చూడాలన్నారు. పారిశుధ్య పనులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. గ్రామాల్లో క్లోరినేషన్, ఫాగింగ్ వంటి పనులు చేపట్టాలని సూచించారు. ఎల్‌ఆర్‌ఎస్ సర్వే వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్‌రావు, ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు రమేశ్, అంజయ్య, స్నేహ, సౌందర్య, వసంత, పద్మ, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

4న ఖో ఖో సబ్‌జూనియర్ ఎంపికలు

నిజామాబాద్ నాగారం : జిల్లా ఖో ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లాలకు సంబంధించి సబ్ జూనియర్ విభాగంలో బాలబాలికల ఎంపికలు కామారెడ్డి జిల్లా పాల్వంచ జిల్లా పరిషత్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కార్యనిర్వహణ కార్యదర్శి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 4న ఉదయం 8 గంటలకు క్రీడాకారులు హాజరు కావాలన్నారు. పాల్గొనే క్రీడాకారులు బోనఫైడ్, ఆధార్ కార్డు, ఫొటోలు తీసుకొని రావాలన్నారు. వివరాలకు 85559 96271, 73965 41233 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఇందూరు జిల్లాలో వర్షం

నిజామాబాద్ అర్బన్: నిజామాబాద్ జిల్లా వ్యాప్తంగా శనివారం మోస్తరు వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి శనివారం ఉదయం 8 గంటల వరకు 40.6 మి.మీ వర్షపాతం నమోదైంది. అత్యధికంగా వర్ని మండలం జాకోరలో 86.3 మి.మీ వర్షం కురిసింది.



బొమ్మన్‌దేవ్‌పల్లి సబ్‌స్టేషన్ ఆవరణలో నిలిచిన వర్షం నీరు



బొమ్మన్‌దేవ్‌పల్లిలో నీటి మునిగిన పంట పొలాలు



చిన్నరాంపూర్ -పోచారం తండా ప్రధానరోడ్డుపైనుంచి పారుతున్న వరదనీరు

శనివారం ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు నమోదైన వర్షపాతం (మి.మీటర్లలో) వివరాలు..

ప్రాంతం	బొమ్మన్‌దేవ్‌పల్లి	నస్రుల్లాబాద్	కొల్లూర్	మగ్దుంపూర్	పిట్లం	సర్వాపూర్	గాంధారి	హసన్‌పల్లి	బీర్కూర్	తాడ్వాయి
వర్షపాతం	138.0	64.0	60.0	48.0	28.8	20.3	18.8	17.5	17.0	16.0



బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఇంటిలోకి చేరిన నీటిని ఎత్తిపోస్తున్న దృశ్యం



బాన్సువాడలోని తాడ్కోల్ చౌరస్తాలో కురుస్తున్న వర్షం

ముంచెత్తిన వాన

- బాన్సువాడ డివిజన్‌లో భారీ వర్షం
- తెగిపడిన విద్యుత్ వైర్లు.. విద్యుదాఘాతంతో ఒకరి మృతి
- పిడుగుపాటుతో ఒకరికి తీవ్ర గాయాలు

సాక్షి ప్రతినిధి, కామారెడ్డి : తుపాను ప్రభావంతో శనివారం జిల్లా అంతటా ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తున్నాయి. ప్రధానంగా బాన్సువాడ డివిజన్‌లో తుపాను ప్రభావం ఎక్కువగా కనిపించింది. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్ మండలాల్లో భారీ వర్షాలు కురిశాయి. భారీ వర్షంతో నాచుపల్లిలో విద్యుత్తు వైర్లు తెగి రేకుల ఇంటిపై పడ్డాయి. గైని స్వాతి (18) అనే యువతి ఇంటి తలుపులు వేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మరణించింది. బొప్పాస్‌పల్లి తండాలో పిడుగుపాటుతో కిమ్యా నాయక్ అనే రైతు గాయాలపాలయ్యారు. నస్రుల్లాబాద్ మండలం బొమ్మన్‌దేవ్‌పల్లిలో ఇళ్లల్లోకి వర్షపు నీరు వచ్చి చేరింది. సంగెం-హాజీపూర్ గ్రామాల మధ్య వాగు పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జిల్లా కేంద్రంలోనూ శనివారం రాత్రి భారీవర్షం కురిసింది. ఎల్లారెడ్డి, పిట్లం, నాగిరెడ్డిపేట, నిజాంసాగర్ తదితర మండలాల్లో ఓ మోస్తరు వాన పడింది.

బాన్సువాడలో..

బాన్సువాడ/బాన్సువాడరూరల్: బాన్సువాడ పట్టణంలో భారీ వర్షానికి రోడ్లన్నీ జలమయం అయ్యాయి. ప్రధాన రాహదారిపై భారీగా నీరు నిలవడంతో వాహనదారులు ఇబ్బందిపడ్డారు. బాన్సువాడ -పిట్లం రోడ్డుపై బొల్లక్‌పల్లి వద్ద భారీ వృక్షం నేలకూలి రోడ్డుపై పడడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బంది ఏర్పడింది. మండలంలోని సోమేశ్వర్, దేశాయిపేట్, ఇబ్రాహింపేట్, బోర్లం, తాడ్కోల్ కొత్తాబాది తదితర గ్రామాల్లో పంటపొలాలు చాలాచోట్ల నీట మునిగాయి.

నస్రుల్లాబాద్ మండలంలో..

నస్రుల్లాబాద్: మండలంలో భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరడంతో ప్రజలు ఇబ్బందిపడ్డారు. బొమ్మన్‌దేవ్‌పల్లి పల్లె హనుమాన్ ప్రాంతంలో పంట పొలాలు చెరువులను తలపించాయి. సబ్ స్టేషన్ మొత్తం నీట మునిగిపోవడంతో సిబ్బంది ఇబ్బందిపడ్డారు. సబ్ కలెక్టర్ కిరణ్మయి బొమ్మన్‌దేవ్‌పల్లి గ్రామంలో పర్యటించారు. ఇళ్లలోకి నీరు చేరిన కుటుంబాలను పరామర్శించారు. రాబోయే రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలకు ముందస్తు సమాచారం అందించాలని, శిథిలమైన ఇళ్లలో నివసిస్తున్న వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని తహసీల్దార్ ప్రవీణ్ కుమార్‌కు సూచించారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా ఉండేందుకు కాలువలలో పూడిక తీయించాలని ఇరిగేషన్ ఏఈ షరీఫ్‌ను ఆదేశించారు. ఆమె వెంట ఆర్ఐ అంజు, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, గ్రామస్తులు రాజా రెడ్డి, మాదేవ్ విఠల్, మహేష్ తదితరులున్నారు.



బొమ్మన్‌దేవ్‌పల్లిలో పరిస్థితిని తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

పొంగుతున్న అంకోల్ క్యాంపు వాగు

నస్రుల్లాబాద్: అంకోల్ క్యాంపు వద్ద గల ఎల్లారెడ్డి-రుద్రూర్ జాతీయ రహదారిపై నూతన వంతెన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భారీ వర్షం కారణంగా గతంలో ఏర్పాటు చేసిన వంతెన పైనుంచి వాగు పారుతుండడంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. తాత్కాలికంగా వేసిన రోడ్డుపైనుంచి భారీగా వరద నీరు ప్రవహించడంతో సుమారు గంటకుపైగా ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. వరద నీటితో వంతెన ప్రమాదకరంగా మారడంతో స్థానిక సీఐతో మాట్లాడి వాహనాలను బీర్కూర్ మీదుగా మళ్లించాలని కోరామని ఏఈఈ శ్రీధర్ 'సాక్షి'తో తెలిపారు. బాన్సువాడ నుంచి బోధన్, నిజామాబాద్‌వైపు వెళ్లే వాహనదారులు బీర్కూర్ మీదుగా వెళ్లాలని సూచించారు.



అంకోల్ క్యాంపు వద్ద ఎల్లారెడ్డి-రుద్రూర్ జాతీయ రహదారి బ్రిడ్జిపైనుంచి పొంగిపొర్లుతున్న వాగు

భారీ వర్షం.. నీటి విడుదల నిలిపివేత

నిజాంసాగర్: నిజాంసాగర్ ప్రాజెక్టు ప్రధాన కాలువ ఆయకట్టు పరిధిలోని నిజాంసాగర్, బాన్సువాడ, నస్రుల్లాబాద్, బీర్కూర్, వర్ని మండలాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో సాగు నీరు వృథా కాకూడదన్న ఉద్దేశంతో ప్రాజెక్టు అధికారులు నీటి విడుదలను నిలిపివేశారు. నిజాంసాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405 అడుగులు (17.8 టీఎంసీలు) కాగా శనివారం సాయంత్రానికి 1,391.51 అడుగుల (4.728 టీఎంసీలు) నీరు నిల్వ ఉంది.

కామారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తా

- ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ



మాట్లాడుతున్న ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, పక్కన ఎంపీ సురేశ్ షెట్కార్

కామారెడ్డి టౌన్: పుట్టిన గడ్డపై ప్రేమతో కామారెడ్డి అభివృద్ధికి కృషి చేస్తానని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ పేర్కొన్నారు. శనివారం మున్సిపల్ కార్యాలయానికి చెందిన రెండు ట్రాక్టర్ ఇంజన్‌లను ప్రారంభించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. పచ్చదనం, స్వచ్ఛదనం కార్యక్రమంలో కామారెడ్డి పట్టణం రాష్ట్రంలోనే ముందు వరుసలో ఉండాలన్నారు. కామారెడ్డి పట్టణాన్ని కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామన్నారు. ప్రతిపక్ష నాయకులు అభివృద్ధిని అడ్డుకోవడంలో పోటీ పడుతున్నారని, తరచూ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదులు చేస్తున్నారని విమర్శించారు. దీంతో కామారెడ్డి నియోజకవర్గం అభివృద్ధిలో పదేళ్ల వెనక్కి వెళ్లిపోయిందన్నారు. ప్రతిపక్షం తీరుతో నియోజకవర్గంలో పని చేయడానికి అధికారులు ఎవరూ ముందు రావడం లేదన్నారు. జిల్లాకు సంబంధించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ప్యాకేజీ పనులను పూర్తి చేయడానికి రూ. 1200 కోట్లు అవసరం ఉండగా సీఎంతో మాట్లాడి రూ. 200 కోట్లు మంజూరు చేయించానని పేర్కొన్నారు. పట్టణంలో రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్ హామీ ఇచ్చారు. కేంద్రంతో కొట్లాడి అభివృద్ధికి కావాల్సిన నిధులు తీసుకొస్తానన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్ రావు, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇందుప్రియ, అధికారులు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

టీవీవీపీ వైద్యుల బదిలీ

- 12 మందిని బదిలీ చేస్తూ ఉత్తర్వులు

కామారెడ్డి టౌన్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న తెలంగాణ వైద్యవిధాన పరిషత్(టీవీవీపీ)కు చెందిన 12 మంది వైద్యులు బదిలీ అయ్యారు. ఈ మేరకు శనివారం టీవీవీపీ కమిషనర్ అజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. జీజీహెచ్‌లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు శ్రీనివాస్, పూర్ణిమ, రవీంద్రమోహన్‌లను ఎల్లారెడ్డి ఏరియా ఆస్పత్రికి, కిషోర్‌గౌడ్, కళావతి, పద్మావతిలను దోమకొండ సీహెచ్‌సీకి, సంతోష్, విజయ్‌భాస్కర్, దేవేందర్, విజయ్‌రాజ్‌లను బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి, శ్రావణిని గాంధారి సీహెచ్‌సీకి, నేహను జుక్కల్ సీహెచ్‌సీకి బదిలీ చేశారు. వీరి స్థానంలో ఎవరినీ నియమించకపోవడంతో జీజీహెచ్‌లో సేవలకు ఇబ్బందులు తలెత్తనున్నాయి.

నిర్లక్ష్యానికి నిండుప్రాణం బలి!

- బాన్సువాడ మైనారిటీ గురుకులంలో విద్యార్థికి అస్వస్థత
- సకాలంలో అందని వైద్యం
- ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి



మృతురాలు అంజలి(ఫైల్)



గురుకులంలోని వంట గదిని పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ కిరణ్మయి

బాన్సువాడ : మైనారిటీ గురుకుల పాఠశాల విద్యార్థిని శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. పాఠశాల సిబ్బంది సకాలంలో స్పందించకపోవడంతో వైద్య అందక మరణించిందని మృతురాలి బంధువులు ఆరోపిస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.

జుక్కల్ మండలం పడంపల్లి గ్రామానికి చెందిన అంజలి (12) బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలలో ఏడో తరగతి చదువుతోంది. గత నెల 29న ఆమె వాంతులు చేసుకోవడంతో రాత్రి సమయంలో డ్యూటీలో ఉన్న పాఠశాల సిబ్బంది ఏవో మాత్రలు ఇచ్చి పడుకోమని చెప్పారు. మాత్రలు వేసుకున్న అంజలి శుక్రవారం ఉదయం పూర్తిగా నీరసించిపోయింది. అయినా పాఠశాల సిబ్బంది ఆమెను ఆస్పత్రికి తీసుకెళ్లకుండా వసతి గృహంలోనే రెస్ట్ తీసుకోవాలని సూచించారు. సాయంత్రం వరకూ అంజలి పరిస్థితి మెరుగుపడకపోవడం, తిరిగి వాంతులు చేసుకోవడంతో గురుకుల సిబ్బంది ఆమె తల్లి చౌత్రబాయికి సమాచారం అందించారు. ఆమె వచ్చి కూతురును బాన్సువాడ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి తీవ్ర జ్వరంతో బాధపడుతోందని, ఫిట్స్ కూడా వచ్చిందని చెప్పారు. వెంటనే నిజామాబాద్‌కు తీసుకెళ్లాలని సూచించారు. దీంతో అంబులెన్సులో నిజామాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృత్యువాత పడింది. తన కూతురును సకాలంలో ఆస్పత్రికి తీసుకువెళ్లి ఉంటే బతికేదని చౌత్రబాయి ఆవేదన వ్యక్తం చేసింది. పాఠశాలలో నెల రోజులుగా వైద్య సిబ్బంది లేరని తెలిసింది. మైనారిటీ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్లే అంజలి మృతిచెందిందని ఆమె కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు.

గురుకులాన్ని సందర్శించిన సబ్ కలెక్టర్

బోర్లం మైనారిటీ గురుకుల పాఠశాలను సబ్ కలెక్టర్ కిరణ్మయి శనివారం ఉదయం సందర్శించారు. ప్రిన్సిపల్ ధనలక్ష్మితో మాట్లాడి విద్యార్థి అంజలి మృతికి గల కారణాలను తెలుసుకున్నారు. తరగతి గదులు, వంట గది, విద్యార్థులు పడుకునే గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ అనారోగ్యంతో విద్యార్థి మృతి చెందడం బాధాకరమన్నారు. మూడు రోజుల క్రితమే అంజలి ఇంటి నుంచి పాఠశాలకు వచ్చినట్లు తెలిసిందని, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు. విద్యార్థినికి వైద్యం అందించిన వైద్యులతో మాట్లాడి అసలేం జరిగిందో కనుక్కుంటానన్నారు. ఆమె వెంట డిప్యూటీ డీఎంహెచ్‌వో దివ్య, డీఎండబ్ల్యూవో దయానంద్, ఆర్‌ఎల్‌సీ కిరణ్‌గౌడ్ తదితరులున్నారు.

నాడు రోడ్డు ప్రమాదంలో భర్త.. నేడు అనారోగ్యంతో కూతురు..

పడంపల్లికి చెందిన చౌత్రబాయి(మున్ని)కి ఇద్దరు కూతుళ్లు. భర్త లారీ డ్రైవర్‌గా పని చేసేవాడు. ఐదేళ్ల క్రితం లారీ టైరు పంక్చర్ కావడంతో టైరును మారుస్తుండగా వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. దీంతో చౌత్రబాయి కూలి పనులు చేసుకుంటూ ఇద్దరు కూతుళ్లను చూసుకుంటూ జీవనం సాగిస్తోంది. పెద్ద కూతురు అంజలి బోర్లం మైనారిటీ గురుకులంలో, చిన్న కూతురు అపూర్వ గాడేగాం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారు. పెద్ద కూతురు అనారోగ్యంతో శుక్రవారం రాత్రి మృతి చెందడంతో ఆమె కన్నీరుమున్నీరవుతోంది.

యువతకు ఉపాధి కల్పిస్తాం

- ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావు
- వివేక్ ఆగ్రో బయో ప్రొడక్ట్ కంపెనీకి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, పక్కన కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

సదాశివనగర్: నియోజకవర్గ యువతకు ఉపాధి కల్పించడమే ధ్యేయంగా కృషి చేస్తానని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు అన్నారు. మండలంలోని లింగంపల్లి శివారులో ఏర్పాటు చేసిన బయో ప్రొడక్ట్ కంపెనీ కోసం ఏర్పాటు చేసిన శంకుస్థాపనను ఆయన ప్రారంభించి పూజలు చేశారు. నియోజకవర్గంలో వివేక్ బయోప్రొడక్ట్ చరిత్రలో నిలిచిపోతుందన్నారు. భవిష్యత్తులో నియోజకవర్గంలో ఇలాంటి కంపెనీలను మరెన్నో తీసుకు వచ్చి యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని అన్నారు. జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఎల్లారెడ్డి అభివృద్ధికి మరింత కృషి చేస్తారని అన్నారు. భూములు కోల్పోయిన రైతులకు భూములు ఇప్పించినట్లు పేర్కొన్నారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఎంపీ సురేశ్ షెట్కార్, మాజీ వైస్ ఎంపీపీలు గాదారి శ్రీనివాస్ రెడ్డి, రూపేందర్ రెడ్డి, ఆర్డీవో రంగనాథ్, తహసీల్దార్ గంగాసాగర్, ఎంపీడీవో సంతోష్‌కుమార్, ఎంఈవో యోసెఫ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్, బొంబోతుల లింగాగౌడ్, లింగారావు, సంగారెడ్డి, మద్దెల బాగయ్య, ఇర్షాదొద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా రజిత



ఎల్లారెడ్డిరూరల్: ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్‌గా మారెడ్డి రజిత, వైస్ చైర్మన్‌గా జొన్నల రాజు నియమితులయ్యారు. దీంతో రజిత దంపతులు ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావును కలిసి కృతజ్ఞతలు తెలిపారు.

మినీ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభం తొలగింపు



తాడ్వాయి: మండలంలోని చందాపూర్‌లో ప్రధాన రహదారి పక్కన ప్రమాదకరంగా ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని విద్యుత్ సిబ్బంది శనివారం తొలగించారు. 'విద్యుత్ స్తంభాన్ని సరిచేయండి' అనే శీర్షికతో ఈ నెల 27న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. ప్రమాదకరంగా ఉన్న మినీ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాన్ని తొలగించారు. కొద్ది దూరంలో వేరే స్తంభాన్ని ఏర్పాటు చేసి మినీ ట్రాన్స్‌ఫార్మను బిగించారు. సమస్య పరిష్కారం కావడంపై గ్రామస్తులు, ప్రయాణికులు హర్షం వ్యక్తం చేశారు.

పోలీసుల గాలింపు చర్యలు

సాక్షి ఎఫెక్ట్..

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు గంజాయి బ్యాచ్‌ల కోసం శనివారం గాలింపు చర్యలు చేపట్టారు. శనివారం 'సాక్షి' దినపత్రికలో ప్రచురితమైన 'గంజాయి ఘాటు..' శీర్షికన ప్రచురితమైన వార్తకు స్పందించిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు మండలంలో గాలింపులు చేపట్టారు. గంజాయి వ్యాపారం గురించి టాస్క్‌ఫోర్స్ సిబ్బందితో పాటు సీసీఎస్ పోలీసులు సైతం మండలానికి వచ్చి రహస్యంగా వివరాలు తెలుసుకున్నారు. పోలీసుల వాహనాలు కనిపించడంతో గంజాయి బ్యాచ్‌కు సంబంధించిన వారు బయట కనిపించలేదు. 'సాక్షి'లో ప్రచురితమైన వార్తను కొందరు సోషల్‌మీడియాలో షేర్ చేయడంతో పాటు కొందరు వాట్సాప్ స్టేటస్‌లో కూడా పెట్టుకున్నారు.

రైతుల అభ్యున్నతి కోసమే..


బిచ్కుందలో రైతులతో మాట్లాడుతున్న సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

బిచ్కుంద(జుక్కల్): రైతుల అభ్యున్నతి కోసమే తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ పనిచేస్తుందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ సుంకెట అన్వేష్‌రెడ్డి అన్నారు. బిచ్కుంద రైతు వేదికలో విత్తనాల డీలర్లు, రైతులతో శనివారం సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వం రైతులకు కావాల్సిన విత్తనాలు ఇవ్వడంలో విఫలం కావడంతో ప్రైవేటు విత్తన కంపెనీల పెత్తనం పెరిగిందన్నారు. రైతులకు మేలు జరిగే విధంగా ప్రభుత్వంతో మాట్లాడి తిరిగి రాయితీలు, అన్ని రకాల విత్తనాలు అందే విధంగా తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం సంస్థ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా డీఏవో తిర్మల్ ప్రసాద్, టీజీ సీడ్స్ మేనేజర్ సంధ్యారాణి, విష్ణువర్ధన్‌రెడ్డి, ఆదినారాయణరెడ్డి, పీసీసీ డెలిగెట్ విఠల్ రెడ్డి, సొసైటీ చైర్మన్ బాలాజీ, ఏవో రాజలింగం రైతులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు




మద్నూర్(జుక్కల్): ప్రజారోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అన్ని వార్డుల్లో తిరిగి రోగులతో మాట్లాడారు. అనంతరం ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆస్పత్రిలో సరైన వైద్య సేవలు అందడం లేదని ఆరోపణలు వస్తున్నాయని అలాంటివి రాకుండా చూసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులపై వైద్యులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ సునీల్ జాదవ్, వైద్య సిబ్బంది, నాయకులు ఉన్నారు.

గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి


గాంధారిలో మాట్లాడుతున్న తహసీల్దార్ సతీశ్‌రెడ్డి

లింగంపేట/ గాంధారి/ పిట్లం/ ఎల్లారెడ్డి: గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని పోలీసులు సూచించారు. లింగంపేట మండల కేంద్రంలోని జీఎస్ఆర్ గార్డెన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఎల్లారెడ్డి సీఐ రవీందర్‌నాయక్ సూచించారు. ఈ నెల 7న గణేశ్ మండపాల్లో ప్రతిష్ఠించే వినాయక విగ్రహాల వద్ద గట్టి నిఘాను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేందర్, ఎంపీడీవో నరేశ్, ఎస్సై అరుణ్‌కుమార్, ఆయా శాఖల అధికారులు, కుల సంఘాల పెద్దలు పాల్గొన్నారు. గాంధారి మండలంలోని బృందావన్ గార్డెన్‌లో ఎస్సై ఆంజనేయులు శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. గణేశ్ మండపాల నిర్వాహకులు పోలీసు శాఖ సూచనలు పాటించాలని తహసీల్దార్ సతీశ్‌రెడ్డి సూచించారు. సమావేశంలో ఎంపీడీవో రాజేశ్వర్, మాజీ జడ్పీటీసీ తానాజీరావు, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఎంపీటీసీలు బాల్‌రాజు, తూర్పురాజు, నాయకులు, యువకులు పాల్గొన్నారు. పిట్లం మండలంలో వినాయక మండపాల నిర్వాహకులతో ఏఎస్సై లింబాద్రి సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు. ఎల్లారెడ్డి మండలంలో గణేశ్ మండలి నిర్వాహకులు మండపాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఎస్సై మహేశ్ సూచించారు. దీని ద్వారా మండపాలకు భద్రత కల్పించడంతో పాటు బందోబస్తుకు ఏర్పాట్లు చేస్తామని అన్నారు.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్‌నుంచి కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. కాకతీయ కాలువ ద్వారా 4 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వారా 500, లక్ష్మి కాలువ ద్వారా 150 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండగా, ఆవిరి రూపంలో 572 క్యూసెక్కులుపోతోంది. మిషన్ భగీరథ ద్వారా అవసరాలకు 231 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్‌కు 100 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 11 వేల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, అవుట్ ఫ్లో తక్కువగా ఉండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం పెరుగుతోంది. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటి మట్టం 1091(80టీఎంసీలు) అడుగులు కాగా శనివారం సాయంత్రానికి 1085.20(60.47టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని అధికారులు తెలిపారు.

అద్దెకు ఆర్టీసీ బస్సు

- డిపాజిట్ లేకుండానే సేవలు
- అప్ అండ్ డౌన్ టికెట్లపై 10శాతం రాయితీ



ఖలీల్‌వాడి: కార్తీక మాసం, శుభకార్యాలు, వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులను కిరాయి(అద్దె)కి ఇస్తోంది. ప్రయాణికులకు ప్రత్యేక రవాణా సౌకర్యాన్ని కల్పించేందుకు ప్రణాళిక రూపొందించిన ఆర్టీసీ.. వివాహాలు, విహార యాత్రలకు వెళ్లే వారి కోసం బస్సులను తక్కువ చార్జీకి అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టింది. ప్రైవేట్ వాహనాలతో పోలిస్తే తక్కువ చార్జి చేయనున్నారు. ఉమ్మడి నిజామాబాద్ పరిధిలోని ప్రజలు ఆర్టీసీ బస్సు సేవలను సద్వినియోగం చేసుకునేందుకు డిపో మేనేజర్లను సంప్రదించాల్సి ఉంటుంది. సుదూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు అప్ అండ్ డౌన్‌ను ముందస్తుగా రిజర్వేషన్ చేసుకుంటే 10శాతం రాయితీ పొందొచ్చు.

డిపో మేనేజర్ల వివరాలు..

డిపో	సెల్ నంబర్
ఆర్మూర్	9959226019
బోధన్	9959226001
నిజామాబాద్–1	9959226016
నిజామాబాద్–2	9959226017
కామారెడ్డి	9959226018
బాన్సువాడ	9959226020

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

ఉమ్మడి నిజామాబాద్ ప్రజలకు ఆర్టీసీని అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తున్నాం. వివాహాలు, విహారయాత్రలకు వెళ్లేవారు ముందస్తుగా ఆర్టీసీ బస్సును బుక్ చేసుకోవచ్చు. బుకింగ్‌కు ఎలాంటి డిపాజిట్ అవసరం ఉండదు. ఆర్టీసీలో ప్రయాణం సురక్షితంగా ఉంటుంది.

– జానీరెడ్డి, ఆర్టీసీ ఆర్ఎం, ఉమ్మడి నిజామాబాద్ జిల్లా

నిబంధనలు ఉల్లంఘిస్తే కేసులు


జుక్కల్‌లో ప్రైవేట్ ఆస్పత్రిని తనిఖీ చేస్తున్న ప్రభుత్వ వైద్యుడు విఠల్‌రావ్

నిజాంసాగర్(జుక్కల్)/ నాగిరెడ్డిపేట/ కామారెడ్డి రూరల్: ప్రైవేట్ ఆస్పత్రుల్లో నిబంధనలకు విరుద్ధంగా రోగులకు వైద్య చికిత్సలు చేస్తే కేసులు నమోదు చేస్తామని జుక్కల్ ప్రభుత్వ ఆస్పత్రి వైద్యుడు విఠల్‌రావు హెచ్చరించారు. మండల కేంద్రంలోని పీఎంపీ, ఆర్ఎంపీ క్లినిక్‌లను శనివారం తనిఖీ చేశారు. పీఎంపీలు, ఆర్ఎంపీలు బెడ్స్ ఏర్పాటు చేసి, రోగులకు గ్లూకోస్‌లు పెట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే చేయాలన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. నాగిరెడ్డి మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో పీఎంపీ, ఆర్ఎంపీలు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాలను ఎంపీడీవో ప్రభాకరచారి, పీహెచ్‌సీ వైద్యాధికారి సృజన్ తనిఖీ చేశారు. ఆర్ఎంపీ, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని సూచించారు. వారివెంట పంచాయతీ కార్యదర్శి కిష్టయ్య, వైద్యసిబ్బంది అశ్వక్, శ్రీనివాస్ ఉన్నారు. కామారెడ్డి పట్టణంలోని డ్రైవర్స్ కాలనీలో ఉన్న ప్రైవేటు ఆర్ఎంపీ, పీఎంపీలు నిర్వహిస్తున్న పలు క్లినిక్‌లను దేవునిపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోహ తనిఖీ చేశారు. రోగులకు హోదాకు మించి వైద్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమె వెంట ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం

- స్కూటీ అదుపుతప్పి స్కూల్ బస్సు కింద పడిన తండ్రి, కూతురు
- బాలికకు గాయాలు


అపర్ణను బస్సు కింది నుంచి తీస్తున్న తండ్రి

ఖలీల్‌వాడి: స్కూటీ అదుపుతప్పి తండ్రి, కూతురు స్కూల్ బస్సు కింద పడ్డారు. త్రుటిలో ప్రమాదం తప్పింది. నగరంలోని సుభాష్ నగర్‌లో చోటు చేసుకున్న ఘటనకు సంబంధించి స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. రైల్వే క్వార్టర్స్‌కు చెందిన బాలిక అపర్ణ హోలీమేరీ స్కూల్‌లో పీపీ–2 చదువుతోంది. ఆమెను స్కూల్‌లో దింపేందుకు తండ్రి స్కూటీపై వెళ్తుండగా అదుపుతప్పి స్కూల్ బస్సుకిందపడ్డారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించి బస్సును నిలిపివేశాడు. బాలిక చేతులకు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే ఆమెను తండ్రి అంబులెన్స్‌లో ప్రైవేట్ ఆస్పత్రికి తరలించాడు. సమాచారం అందుకున్న మూడో టౌన్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీసీ ఫుటేజీని పరిశీలించారు. స్కూటీ అదుపుతప్పిన కారణంగా ఈ ఘటన చోటు చేసుకుందని, ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై మహేశ్ తెలిపారు.


ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక అపర్ణ

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి రూరల్: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని దేవునిపల్లి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జోహ ముజీబ్, డాక్టర్ దివ్య సూచించారు. మండలంలోని చిన్నమల్లారెడ్డి గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ నిరంజన్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈ హన్మంత్‌రావుకు పదోన్నతి

నిజామాబాద్‌నాగారం: రోడ్లు, భవనాల శాఖ సూపరింటెండెంట్ ఇంజినీర్ గజవాడ హన్మంత్‌రావుకు చీఫ్ ఇంజినీర్‌గా పదోన్నతి రావడంతో హైదరాబాద్‌లోని కార్యాలయంలో శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఐదు నెలల క్రితం బదిలీపై జిల్లాకు ఎస్ఈగా వచ్చిన హన్మంత్‌రావు గతంలో జిల్లాలోనే ఏఈగా పని చేశారు. పలు జిల్లాల్లో వివిధ హోదాల్లో ఆయన పని చేశారు. ఆయన జిల్లా ఇన్‌చార్జి ఎస్ఈగా సైతం కొనసాగనున్నారు.

కుక్కల దాడిలో ఐదుగురికి గాయాలు

ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని అన్నాసాగర్‌లో ఐదుగురిపై కుక్కలు దాడి చేసినట్లు స్థానికులు శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన పోచయ్య, సుధాకర్, మహెబూబ్, రాఘవేందర్‌తో పాటు గేదెలు, దూడలపై కుక్కలు దాడి చేసి గాయపరిచినట్లు వారు పేర్కొన్నారు. గ్రామంలో కుక్కల బెడద తీవ్రమైందని వీటి నివారణకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ఎల్లారెడ్డి, బీబీపేటలో డెంగీ కేసులు నమోదు

ఎల్లారెడ్డి/ బీబీపేట: ఎల్లారెడ్డి మండలంలో రెండు డెంగీ కేసులు నమోదైనట్లు మత్తమాల పీహెచ్‌సీ వైద్యులు శరత్‌కుమార్ శనివారం తెలిపారు. మండలంలోని మీసాన్‌పల్లి, బాలాజీనగర్‌తండాకు చెందిన వ్యక్తులకు రక్త పరీక్షలు నిర్వహించగా వీరికి డెంగీ పాజిటివ్ రావడంతో వీరు ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. బీబీపేట మండల కేంద్రానికి చెందిన అంది నిహాంత్ అనే పదేళ్ల బాలుడికి శనివారం డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. వైద్య సిబ్బంది బాలుడి ఇంటికి చేరుకొని పలు వైద్య పరీక్షలు చేసి మందులు ఇచ్చారు. పంచాయతీ కార్యదర్శి రమేశ్ సహాయంతో ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచేలా చర్యలు చేపట్టారు.

క్రైం కార్నర్

చెరువులో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువు నీటిలో శనివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం తేలింది. స్థానికులు పట్టణ పోలీసులకు సమాచారం అందించగా, వారు మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 ఏళ్లు ఉంటుందని, చెరువుగట్టుపై మృతునివిగా భావిస్తున్న ఆకుపచ్చ, నలుపు గీతల షర్ట్, నీలి రంగు ప్యాంట్, చెప్పులు ఉన్నాయని పోలీసులు తెలిపారు. మృతదేహం కుళ్లిపోయిందని, గట్టుపై లభించిన వస్తువుల ఆధారంగా మృతుడి వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్‌రెడ్డి కోరారు.

గుండెపోటుతో రైతు మృతి


మహిపాల్(ఫైల్)

ధర్పల్లి: మండలంలోని దుబ్బకు చెందిన రైతు సదు మహిపాల్(50) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. యూరియా కొనుగోలు చేసేందుకు గ్రామంలోని సొసైటీ గోదాం వద్దకు వెళ్లిన మహిపాల్.. యూరియా బస్తాలను ఆటోలో వేస్తున్న క్రమంలో కుప్పకూలాడు. వెంటనే స్థానిక వైద్యులు ఘటనాస్థలానికి చేరుకొని సీపీఆర్ చేసినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మహిపాల్ మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..


కుర్మ హన్మయ్య మృతదేహం

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్యాయత్నం చేసిన మండలంలోని పోచారం గ్రామానికి చెందిన కుర్మ హన్మయ్య(77) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై మల్లారెడ్డి తెలిపారు. తన కొడుకు మృతి చెందడంతో మానసికంగా కుంగిపోయిన హన్మయ్య గత నెల 29న పురుగుల మందుతాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం మెదక్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శుక్రవారం మృతి చెందాడు. మృతుడి మనవడు సాయిబాబా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సిలిండర్ పేలి రేకుల ఇల్లు దగ్ధం



బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రంలోని వీకర్ సెక్షన్ కాలనీలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి రేకుల ఇల్లు దగ్ధమైంది. గ్రామస్తుల తెలిపిన వివరాలు.. కాలనీకి చెందిన తుకారాం రేకుల ఇంట్లో అదే గ్రామానికి చెందిన పోతుగంటి వీరయ్య కుటుంబ సభ్యులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. శుక్రవారం రాత్రి ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో దాచి డబ్బులు, సామగ్రి పూర్తిగా కాలిపోయాయి. మంటలు ఎగిసిపడడంతో చుట్టుపక్కల వాళ్లు ఇంట్లోని వారిని బయటికి తీసుకువచ్చారు. ఇంట్లో ఉన్న వారికి స్వల్పగాయాలయ్యాయి. అగ్నిమాపక సిబ్బంది, స్థానికులు కలిసి మంటలను అదుపు చేశారు. సుమారు రూ.2.50లక్షలకు పైగా నష్టం వాటినట్లు బాధితులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



మాచారెడ్డి: పాల్వంచ మండలం సింగరాయపల్లి గ్రామానికి చెందిన యువకుడు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం నర్మాల సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన చిట్టిగారి దేవేందర్ గౌడ్(28)శుక్రవారం గంభీరావుపేట మండలం సిరిగాద గ్రామంలోని అత్తగారింటికి వెళ్లి తిరిగి వస్తుండగా ద్విచక్ర వాహనం అదుపు తప్పి కింద పడ్డాడు. ఈ ఘటనలో తల, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలు కాగా, చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్ లో కామారెడ్డి జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య రవళి, రెండు నెలల కూతురు ఉన్నారు.

దాడి కేసులో విచారణ

ఖలీల్‌వాడి: నగరంలోని గౌతంనగర్ చౌరస్తా వద్ద రెండు రోజుల క్రితం మధు అనే వ్యక్తిపై కర్రతో దాడి చేసిన పవన్‌ను పోలీసులు శనివారం అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. మధు కంటి భాగంలో తీవ్రగాయాలు కావడంతో చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై మహేశ్‌ను వివరణ కోరగా పవన్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిపారు.

పోక్సో కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బాలికతో అసభ్యంగా ప్రవర్తించిన వ్యక్తిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై యాసిన్ అరాఫత్ శనివారం తెలిపారు. అహ్మద్‌పురా కాలనీకి చెందిన పదేళ్ల బాలిక శుక్రవారం మధ్యాహ్నం కిరాణా షాపునకు వెళుతుండగా, బాసిత్ (50) అనే వ్యక్తి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తన తల్లి దండ్రులకు విషయం తెలుపగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

లాడ్జి యజమాని, కౌన్సిలర్‌పై పిటా కేసు నమోదు

బోధన్‌టౌన్: పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఉన్న స్వాగత్ లాడ్జి యజమాని మహమూద్, కౌన్సిలర్ గంగారాంపై పిటా(ప్రివెన్షన్ ఆఫ్ ఇమ్మోరల్, ట్రాఫికింగ్) కేసు నమోదు చేసినట్లు పట్టణ సీఐ వీరయ్య తెలిపారు. కౌన్సిలర్ గంగారాం శుక్రవారం ఓ మహిళతో కలిసి స్వాగత్ లాడ్జికి వెళ్లగా, వారిని లాడ్జి యజమాని అనుమతించి సహకరించాడు. ఈ ఘటనపై సుమోటో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. లాడ్జిల్లో నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

పిడుగుపాటుతో తెగిపడిన వైర్లు

- నాచుపల్లిలో విద్యుత్ షాక్‌తో యువతి మృతి
- నస్రుల్లాబాద్ మండలంలోని పలు గ్రామాల్లో పడిన పిడుగులు


స్వాతి(ఫైల్)

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. పిడుగుపాటు కారణంగా పశువుల కాపరికి గాయాలు కాగా, విద్యుత్ షాక్‌తో ఓ యువ తి మృతి చెందింది. ఆయా ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.. పిడుగుపాటు కారణంగా నాచుపల్లి గ్రామానికి చెందిన స్వాతి(18) అనే యువతికి చెందిన ఇంటి రేకుల పైకప్పుపై విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. ఇంటి తలుపు సైతం ఇనుముది కాగా, ఆమె తలుపు తీస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. ఘటనాస్థలాన్ని నాయబ్ తహసీల్దార్ బావయ్య, గిర్దావార్ అంజు పరిశీలించారు. వారి వెంట కాంగ్రెస్ నాయకుడు, మాజీ ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్, మాజీ సర్పంచ్ రవి ఉన్నారు. బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం అందించారు.

పశువుల కాపరికి తీవ్రగాయాలు..


గాయాలపాలైన కిమ్యానాయక్

నస్రుల్లాబాద్(బాన్సువాడ): పిడుగుపాటుతో మండలంలోని బొప్పాస్‌పల్లికి చెందిన చవాన్ కిమ్యా (60)కు తీవ్రగాయాలయ్యాయి. కిమ్యా శనివారం బొప్పాస్‌పల్లి విత్తనోత్పత్తి క్షేత్రం పడావు భూముల్లో పశువులను మేపుతుండగా సమీపంలోని ఓ చెట్టుపై పిడుగుపడింది. దీంతో కిమ్యా అక్కడికక్కడే కుప్పకూలిపోయాడు. సమీపంలో ఉన్న పశువుల కాపరులు గమనించి కిమ్యా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. బాధితుడిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు.

ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా విద్యుత్ షాక్‌తో మృతి

ఖలీల్‌వాడి: నగరంలోని ఐదో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని నాగారాం ప్రాంతానికి చెందిన ఖాలేక్ బిన్ అబ్దుల్లా(48) విద్యుత్ షాక్‌తో మృతి చెందినట్లు ఎస్సై గంగాధర్ తెలిపారు. అబ్దుల్లా తన ఇంట్లో ఫ్యాన్ రిపేర్ చేస్తుండగా షాక్ తగిలిందన్నారు. మృతుడికి ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం


సుంకెట రవి(ఫైల్)

కమ్మర్‌పల్లి: మండల కేంద్రం శివారులోని పాటి హనుమాన్ సమీపంలో శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. కమ్మర్‌పల్లికి చెందిన సుంకెట రవి(29) మెట్‌పల్లి వైపు నుంచి కమ్మర్‌పల్లి వైపునకు ద్విచక్ర వాహనం వస్తుండగా, మెట్‌పల్లి వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రవి తల, ముఖం, కాళ్లకు తీవ్ర గాయాలు కాగా, గ్రామస్తులు అంబులెన్స్‌లో ఆర్మూర్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ రాత్రి సమయంలో చనిపోయాడు. రవి ఉన్నత విద్య అభ్యసించడానికి నాలుగేళ్ల క్రితం ఆస్ట్రేలియా వెళ్లాడు. 15 రోజుల క్రితం సొంత పనుల నిమిత్తం స్వగ్రామానికి వచ్చాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి..


మారుతి (ఫైల్)

మోపాల్(నిజామాబాద్ రూరల్): మండలంలోని నర్సింగ్‌పల్లి గ్రామశివారులో ఉన్న చెరువులో పడి డిచ్‌పల్లి మండలం ఘన్‌పూర్ గ్రామానికి చెందిన నాగుల మారుతి (32) మృతి చెందినట్లు ఎస్సై యాదగిరిగౌడ్ శనివారం తెలిపారు. తన చిన్నమ్మ కుమార్తె వివాహానికి హాజరయ్యేందుకు మారుతి శుక్రవారం నర్సింగ్‌పల్లికి వచ్చాడు. శనివారం ఉదయం తన అన్న అజయ్, మరో ఇద్దరితో కలిసి మారుతి కాలకృత్యాలు తీర్చుకునేందుకు చెరువు వద్దకు వెళ్లాడు. ఈక్రమంలో అందరూ చూస్తుండగానే ప్రమాదవశాత్తు చెరువులో పడి మునిగిపోయాడు. పోలీసులు జాలర్ల సహాయంతో మృతదేహాన్ని బయటికి తీయించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.